23వ వార్డులో కమిషనర్ పర్యటన

వార్డులో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ మహేశ్

మేడ్చల్, ఫిబ్రవరి 21 : మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డులో బుధవారం కమిషనర్ నాగిరెడ్డి పర్యటించారు. వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, వ్యాక్సిన్ కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహావీర్‌చౌరస్తా నుంచి స్వచ్ఛ్ మార్ట్ వరకు రూ. 34 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను, అంగన్‌వాడీ కేంద్రం భవన మరమ్మతు పనులను కౌన్సిలర్ కౌడె మహేశ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌యాదవ్, వర్క్‌ఇన్ స్పెక్టర్ లావణ్య, జవాన్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డిని సన్మానించిన కార్పొరేటర్లు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 21: జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డికి పాలకవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కార్పొరేషన్ శానిటరీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు మేక లలితా యాదవ్, శాంతీకోటేశ్‌గౌడ్,పీ. బాబు, రాజ్‌కుమార్, సాయి, నవీన్‌కుమార్, నాయకులు మనోధర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీశ్‌గౌడ్, కృష్ణ, సుబ్రమణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తా..

• మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 21: ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వెంకటాపురం డివిజన్ దినకర్‌నగర్ రోడ్డు నంబర్ 11లో డ్రైనేజీ నిర్మించాలని పలువురు నాయకులు బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మౌలాలి డివిజన్‌కు చెందిన లావణ్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అల్వాల్ సర్కిల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ పైపులను తొలగించి కొత్తగా డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. అధికారులతో డ్రైనేజీ, రోడ్డు, పార్కులను సర్వే చేయించి నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధిపనులు చేపడతామన్నారు.

నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రైవేటు దవాఖానలో చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సిఫారసు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అనిల్‌కిశోర్ గౌడ్, కృష్ణరావు,విజయ్‌గౌడ్, అమర్‌నాథ్, సయ్యద్ మోసిన్, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆధునిక డ్రైనేజీ నిర్మించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లావణ్య బంధువుకు సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీ లాడ్స్‌తో చేపట్టిన పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఈనెల చివరి నాటికి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు అభివృద్ధి పనుల పురోగతిని నియోజకవర్గాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్న పనులను పూర్తి చేయాలని, ఇప్పటివరకు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయని, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని రద్దు చేశారన తెలుసుకున్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సీపీవోకు పంపాలని సూచించారు.

తదుపరి నిర్వహించే సమావేశం వరకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీడబ్ల్యూవో, డీఆర్‌డీఏ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

సీపీఎం కార్యాలయంలో పుస్తక పఠనం

చర్లపల్లి, ఫిబ్రవరి 21 : రెడ్ బుక్ డే సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని సీపీఎం కార్యాలయంలో 'లెనిన్ ఓ విప్లవాయుధం' అనే పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కాప్రా సర్కిల్ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ లెనిన్ ఆలోచనలు నేటి సమాజానికి అవసరమని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. సీతారాం ఏచూరి లెనిన్‌పై రచించిన 'మానవాళి విముక్తి కోసం సాగే విప్లవ ప్రగతికి ఎంతో ఆదర్శమన్నారు. అనంతరం లెనిన్ జీవన విధానం, అయనపై పలువురు రచించిన పుస్తకాలను పఠనం చేశారు. నాయకులు ప్రసాద్, యాదగిరి, ఎంఎస్ రావు, శ్రీనివాస్, ఉన్నికృష్ణ, వెంకట్, జీవీ రావు, పోతురాజు, డీకే దుర్గయ్య, ప్రసాద్, బాబు, జయరాజు, రుక్కయ్య, సఫియా, శారద, గౌసియా, శోభ పాల్గొన్నారు.

ప్రభుత్వ, సీలింగ్ భూములను గుర్తించాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వ, సీలింగ్ భూములు గుర్తించి, గుగూల్ మ్యాప్ తయారు చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీవోలు, తాసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సీలింగ్ భూములన్నింటిని ధరణిలో క్రయ విక్రయాలు జరుగకుండా చూడాలన్నారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న వాటికి కౌంటర్ ఫైల్ చేయాలని తాసీల్దార్లను ఆదేశించారు. హౌసింగ్ బోర్డు భూములను కాపాడాలని సూచించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుగూల్ మ్యాప్‌లో గుర్తించాలన్నారు. ఓఆర్‌ఆర్ చుట్టూ ఇండస్ట్రియల్ పార్కు స్థాపించడానికి ప్రభుత్వ భూములను గుర్తించామని తెలిపారు. మండలాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న టీఎస్‌బీపాస్ దరఖాస్తులను పరిశీలించి పంపాలని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓ శ్యామ్‌ప్రకాశ్, తాసీల్దార్లు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో దశల వారీగా అభివృద్ధి పనులు

• ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఓల్డ్ మల్లాపూర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్, ఫిబ్రవరి 21 : ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ నాగలక్ష్మీనగర్ కాలనీలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీశ్, మేనేజర్ సందీప్, కాలనీ అధ్యక్షుడు పీజీ సుదర్శన్, నాగరాజు, ఈశ్వర్, రాజేశ్, భిక్షపతి, స్థానికులు పాల్గొన్నారు.

నాగారాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా..

10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ 10వ వార్డు సింహాపురి కాలనీలో రూ. 6.40 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు చైర్మన్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఓల్డ్ విలేజీలో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కే.దివ్య, నాయకుడు దయాకర్‌రావు, ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ అని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. 9వ వార్డు ఎస్వీనగర్ కాలనీకి చెందిన కొక్కొండ ఆగిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 90 వేల చెక్కును బుధవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ అందజేశారు. కౌన్సిలర్ అనిత, నాయకుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్‌పై ఎస్‌వోటీ పోలీసుల దాడి..

కీసర, ఫిబ్రవరి 21 : నాగారం మున్సిపాలిటీ పరిధిలో మసాజ్ సెంటర్‌పై బుధవారం ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నడిపిస్తున్న మసాజ్ సెంటర్‌పై మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ సీఐ జానయ్య, ఎస్ఐ పరమేశ్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేశారు.

దాడుల్లో మసాజ్ సెంటర్ ఆర్గనైజర్ వినోద్‌తోపాటు ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులను పట్టుకొన్నారు. వీరిపై కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా బధిర విద్యార్థుల వీడ్కోలు

జాన్ పీటర్ మెమోరియల్ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న బధిర విద్యార్థులు

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 21 : నేరేడ్‌మెట్ శ్రీకాలనీలోని జాన్ పీటర్ మెమోరియల్ బధిరుల జూనియర్ కళాశాలలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బధిర విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెలెన్ కెల్లర్ చైర్మన్ లయన్ పఠాన్ ఉమ్మర్‌ఖాన్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంత రం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌ఓడీ జె. అంజయ్య, కళాశాల ప్రిన్సిపాల్ మధుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ ఫొటోగ్రఫీలో జాతీయ పురస్కారం

పోలీస్ ఫొటోగ్రఫీ విభాగంలో జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్న మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ ప్రసాద్‌ను బుధవారం డీజీపీ రవిగుప్తా శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆయన వెంట సీపీ స్టీఫెన్ రవీంద్ర ఉన్నారు. – మేడ్చల్

మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమావేశం

మహిళా సమాఖ్య ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వం అందించే బ్యాంకు రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఆర్పీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్‌లో మహిళా భవనాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్మిళ, సీ.ఓ వెంకటేశ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

డీపీఎస్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు..

అవార్డులతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు

ఉప్పల్, ఫిబ్రవరి 21 : నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్(కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ కరిక్యూలమ్)కు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి. కేంబ్రిడ్జ్ స్కూల్ కాంక్లేవ్–సౌత్ ఏషియా, ఎక్సలెన్స్ రికగ్నిషన్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డు వేడుకల్లో మూడు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా డీపీఎస్ ప్రతినిధులు వివరాలను వెల్లడించారు. ది ఇన్నోవేటివ్ టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డు, బెస్ట్ కేంబ్రిడ్జి స్కూల్ ఫర్ ఎర్లీ ఇయర్స్ ఎడ్యుకేషన్ అవార్డు, ది అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ అవార్డులను పొందినట్లు తెలిపారు. నిబద్ధత, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కోసం రూపొందిస్తున్న పరిశోధనాత్మక కరిక్యులమ్, హైస్టాండర్స్‌కు గుర్తింపుగా అవార్డులు దక్కాయని డీపీఎస్ చైర్మన్ మల్క కొమురయ్య తెలిపారు. ప్రిన్సిపల్ సునీతారావు, సీనియర్ వైస్ ప్రిన్సిపల్ శాంతి అంథోని, శివాని నథన్, యామిని, సునీల్ తివారీ, నాన్సి థామస్, సెలిన్ శిలాజరస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రేమించడం తప్పా..' నాటిక ప్రదర్శన

మల్లాపూర్, ఫిబ్రవరి 21 : మాడుగుల కృష్ణమోహన్ రచన, దర్శకత్వంలో బుధవారం మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం ఆవరణలో ప్రేమించడం తప్పా నాటిక ప్రదర్శనను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర, నాటక రంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో రవి ఆర్ట్స్ అసోసియేషన్ 61వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నాటికను ప్రదర్శించారు. మాడుగుల కృష్ణమోహన్, రక్త కన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత, జి. మనుప్రియ, రమేశ్‌గౌడ్, రామాయణం సత్యనారాయణ, గోవింద్ సత్యనారాయణ, ఎంవీ ఎస్ ఫణిందర్, ఎంవీ సాయిపవన్, దాసరి అరవింద్‌రాజ్, తదితరులు నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

మేడ్చల్, ఫిబ్రవరి 21 : మేడ్చల్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ, రాఘవేంద్రనగర్, కిష్టాపూర్ రోడ్డు, కేఎల్ ఆర్ ఫేజ్ 1, 2, 3 ప్రాంతాలకు గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ శశిధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆయా ప్రాంతాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. కాగా శామీర్‌పేట మండలం ఆలియాబాద్ గ్రామంలోని గృహ, వాణిజ్య కనెక్షన్లకు ఉదయం 10 నుంచి సాయత్రం 5 గంటల వరకు సరఫరాలో విద్యుత్ కోత విధించనున్నట్టు ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఆవులకు తైలేరియా వ్యాధి నివారణ టీకాలు

మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 21: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఆవులకు ఉచిత తైలేరియా వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సంకర జాతి ఆవులకు వ్యాధి సోకి పశువులు మరణించే అవకాశం ఉన్నందున టీకా వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ హేమంత్‌రెడ్డి, పశు వైద్యాధికారి కురుమూర్తి, జేవీవో శ్రీనివాస్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

• అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టరేట్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి విద్యా శాఖ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్, టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణా ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ ఫస్టీయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇంటర్ పరీక్షలను 139 కేంద్రాల్లో నిర్వహించనుండగా, ప్రథమ సంవత్సరానికి సంబంధించి 65,965 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 65,495 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని, ఇందుకోసం 231 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, మొత్తం 47,406 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రశ్నాపత్రాలను తరలించడంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గకుండా చూడాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలకు ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని పేర్కొన్నారు. డీఐవో కిషన్, డీఈవో విజయకుమారి, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

బ్లూక్రాస్ ప్రతినిధులకు ఎంఓయూ పత్రాలను అందజేస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు

పీర్జాదిగూడ, ఫిబ్రవరి21: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి కుక్కల బెడద నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జంతు జనన నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ రెబిస్ టీకాలు ఇచ్చేందుకు బ్లూక్రాస్ సంస్థతో చేసుకున్న ఎంఓయూ పత్రాలను ఆ సంస్థ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం 16వ డివిజన్‌లో చేపట్టిన కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో యాభై శాతం వీధి కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్లు చేసిన కుక్కలకు రేడియం ట్యాగ్ వేయాలని అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని బస్తీ దవాఖానా, యూపీహెచ్‌సీలో కుక్క కాటుకు గురైన వారి కోసం యాంటీ రెబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్ బండి రమ్య సతీశ్‌గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్ర



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్

మేడ్చల్, ఫిబ్రవరి 21 : విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల దేవేందర్‌గౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలను గెలుపొందే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్ర చేపట్టినట్టు తెలిపారు. యాదాద్రి లక్ష్మీనర్సిహ స్వామి ఆశీస్సులతో ప్రారంభమైన భాగ్యనగర విజయ సంకల్ప యాత్ర ఈ నెల 23న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్‌లో ప్రవేశించి మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పదేండ్ల పాలనలో తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో దేశ ప్రభ పెరిగిందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ద్వారా దేశ అభివృద్ధి మరింత మెరుగవుతుందన్నారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్ రెడ్డి మాట్లాడుతూ సీఎంరేవంత్ రెడ్డికి రాజకీయ పునర్జన్మ ఇచ్చిన మల్కాజిగిరి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రశ్నించే గొంతుకగా చెప్పుకునే రేవంత్‌రెడ్డి ఎంపీగా పార్లమెంట్ ఏనాడు ప్రజల తరుపున మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ ఆర్‌కే శ్రీనివాస్, రాష్ట్రమీడియా కోఆర్డినేటర్ విజీత్‌వర్మ, పప్పు పటేల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ ముఖద్వారం ప్రారంభం

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : నాగారం మున్సిపాలిటీ 15వ వార్డు ఈస్ట్ గాంధీనగర్ కాలనీలో నిర్మించిన పోచమ్మ ఆలయ ముఖద్వారాన్ని బుధవారం కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభిచారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సత్యంసాగర్, కాలనీ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, శ్రావణ్, నాయకులు ప్రవీణ్,మూర్తి, హన్మంత్ రెడ్డి, డేవిడ్‌రాజు, పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జడ్సీగా ముకుందరెడ్డి

కాప్రా, ఫిబ్రవరి 21: ఎల్‌బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ పంకజ 45 రోజులపాటు సెలవులో వెళ్లడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి(ఎఫ్‌ఏసీ)గా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి.ముకుందరెడ్డిని నియమించారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ డి.రొనాల్డ్‌రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. కాప్రా సర్కిల్‌లో కొనసాగుతూనే ఎల్బీనగర్ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్(ఎఫ్‌ఏసీ)గా ముకుందరెడ్డి కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

దేవాలయ నిర్మాణం కోసం విరాళాలు

కీసర, ఫిబ్రవరి 21; కీసరలోని పోచమ్మ,ఎల్లమ్మ, ఈదమ్మ, నాభిశిల దేవాలయ నిర్మాణం కోసం కీసర మార్వాడి సంఘం నేత మోహన్‌లాల్ చౌదరి బుధవారం రూ.75,116 విరాళం అందించారు. మార్వాడి సంఘం నేత విరాళాలు అందించడం అభినందనీయమని ఆలయ కమిటీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

వీఆర్‌పీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి

మల్లాపూర్, ఫిబ్రవరి 21 : విద్యార్థుల రాజకీయ పార్టీ(వీఆర్‌పీ) గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా కాప్రా సర్కిల్ మీర్‌పేట్ డివిజన్ కృష్ణానగర్ కాలనీకి చెందిన ఎం. మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్రా సుఖేందర్‌రెడ్డి నియామక పత్రాన్ని మల్లారెడ్డికి అందజేశారు.